# అదీ సంగతి !

ప్రతి వాళ్ళకీ వాడుక పదాలని ఒకటో, రెండో వుంటుంటాయ్. వాటిని ఎంత ధారాళంగా , తరచుగా వాడేస్తుంటారంటే ఆ సంగతి అనే వాళ్ళకే, మనకి తెలీదు. వీటిని ఊతపదాలని కూడా అంటుంటారు.

ఈ వాడుక పదాల్లో కొన్ని వినసొంపుగా వుంటాయ్. మరికొన్ని అసంధర్భంగాను, అసహ్యంగాను వుంటాయ్. ఒక ఇల్లాలికి ' వెధప్పీనుగ ' అనే మాట నిమిషానికి నాలుగు సార్లు నోట్లోంచి జారి పడుతూ వుంటుంది. పిల్లలకి, పెనిమిటికి ,. పక్కన వున్న వాళ్ళకీ ఎవర్ని సంబోధించాలన్నా, లేక ఎవరి గురించి చెప్పాలన్న ఆ పదంతోనే ప్రారంభమవుతుంది. మీ వారో అని అడిగారనుకోండి. ఏమాత్రం సంకోచించకుండా ' వెధప్పీనుగ ఇంకా రాలా ' అనే బదులిస్తుంది. వినే వాళ్ళకి ఇబ్బందిగా, ఆశ్చర్యంగా అనిపిస్తుందే గాని, ఆవిడ మనస్సులో రవ్వంత అగౌరవ భావనే వుండదు. అలాగే ఇంకో ఆసామికి ' అంతా మీ దయ ' అనటం అలవాటు. భోజనం చేశావా అనడిగితే ' మీ దయ వల్ల ' అంటారు. ఏ ప్రశ్నకి బదులివ్వాలన్నా ' అంతా మీ దయ ' అనటం అలవాటైన వాడిని పొరపాటున ' ఏవయ్యా తండ్రివి కాబోతున్నావట, కంగ్రాట్స్ ' అని చూడండి. సమాధానం ఏమిటో మీకు తెల్సు.....

అలవాటు కొద్దీ పదాల్ని వాడేస్తారేగానీ, ఆలోచనే వుండదు. ఒకసారి రైలు ప్రయాణంలో ఒక పెద్ద మనిషి తగిలాడు. ఆయనకి క్షణక్షణానికీ ' అమాంతం ' ' అనటం అలవాటు కాబోలు చంపుకుతిన్నాడు. రాజమండ్రి వెళ్ళాలండి అనుకోకుండా అమాంతం బయల్దేరా. మామూలుగా అయితే రిజర్వేషన్ లేకుండా, నే చస్తే ట్రావెల్ చేయను. కానీ మా పెద్ద కోడలు అమాంతం కడుపుతో వుందని కబురొస్తేను బయల్దేరా. స్టేషన్కొచ్చి చూద్దునుకదా అమాంతం కళ్ళు తిరిగినాయి. చేంతాడంత క్యూ, ఏం చేయాలని ఆలోచించి అమాంతం నేను లైన్లో నిల్చున్నా. ఇలా సాగింది వారి సంభాషణ. సారి ఉపన్యాసం.

రాజకీయ నాయకులకి గూడా వాడుక పదాలు, వేడుక పదాలూ వుంటాయ్. ' ప్రజాస్వామ్యం ' సన్నకారు చిన్నకారు రైతుల సంక్షేమం, హరిజన , గిరజణ ఉద్దరణ వగైరా.

ఇవన్నీ విని మనం పొంగిపోయి ఓట్లేసి గెలిపించి, పదవులు కట్టపెడుతున్నాం. టీవీ రామాయణం, భారతం పుణ్యమాని చాలా పదాలు ప్రజలకి అలవాటయ్యి , వాడుక పదాలుగా మారాయి. ' పరంతు ' ' పితాశ్రీ ' ' ఆయుష్మాన్ భవ ' వగైరాలు. మాబాస్ గుడ్ మార్నింగ్ సారంటే , ' ఆయుష్మాన్ భవ ' అంటున్నారు. మా పిల్లాడేమో, అన్ని పదాలకి చివర్న శ్రీ తగిలించి రకరకాల ప్రయోగాలు చేస్తున్నాడు. పక్కింటాయన్ని అంకుల్ శ్రీ అని, తాతల్ని తాత శ్రీ అని చంపుకుతింటున్నాడు.

అసలీ వాడుక పదాలకు పూర్వచరిత్ర కూడా వుందని, ఈ మధ్యన ఫ్రెండొకరు చెప్పాడు, రామాయణం అంతా విని చివరికి దేవుడు, అనవుడు ఏమైనారని భక్తుడు దాసుగార్ని అడిగాట్ట. ఈ వాడుక పదాల వల్ల అకారణంగా మనం ఇబ్బందుల్లో పడిపోయే ప్రమాదం వుంది. ఒకాయనకి ' నువ్వు చెప్పి నట్టు ' అనటం అలవాటు. మనం ప్రక్కనున్నప్పుడు వారు ఎవరినైనా తిట్టిపోస్తే మనకి పరమ డేంజరు. ' నువ్వు చెప్పినట్టు వీడుత్త వెధవే ' అన్నాడుకోండి తిట్లు తిన్నవాడు మన వంక మింగేసేలా చూస్తాడు. నిజాయితీని , నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకోటానికి మనకి తలప్రాణం తోకలోకి రావచ్చు.

ఒక ఊరిపెద్దకి ' అంతా నా అదృష్టం ' అనటం బాగా అలవాటు. ఓ ప్రేమికుల జంట వచ్చి కాళ్ళపైనపడి ఆశీర్వదించమంటే ఇదంతా నా అదృష్టం ' అన్నాట్ట. అంతే ఆ జంట అటు వాళ్ళకి ఇటు వాళ్ళకి చెప్పకుండా ప్రోసీడయిపోయిందట. పిల్ల తండ్రి రివ్వురివ్వున వొచ్చి ' ఇది ఏమన్నా మీకు భావ్యంగా వుందా ! ' అనగానే ' ఇదంతా నా అదృష్టం ' అన్నాట్ట. పిల్ల తండ్రికి ఒళ్ళు మండి పిల్లకి మైనరు తీరలేదని కేసుపెట్టి ఈ ఊరిపెద్దని సాక్షిగా రమ్మన్నాట్ట. కోర్టుకి వెళుతూ గూడా ' ఇదంతా నా అదృష్టం ' అన్నాట్ట మళ్ళీ. పిల్ల తండ్రికి అర్థం కాక అయోమయంలో పడిపోయి, తర్వాత కాళ్ళ పైన పడి మీ వుద్దేశం ఏమిటి ప్రతి దానికి ' నా అదృష్టం అంటున్నా ' రంటే – ఉద్దేశం కాదు ఇది నా ఊతపదం అన్నాట్ట. ఆడపిల్ల తండ్రి అవాక్కయిపోయాడు. అవడామరి !

------- అయ్యిపోయింది -------